క్లుప్తంగా

ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్లు

నూజివీడు: ప్రస్తుత విద్యాసంవత్సరానికి గానూ నూజివీడులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దేవరకొండ భూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని ఈనెల 8న కళాశాలలో జరిగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాలని కోరారు. వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు ఈనెల 9న కళాశాల్లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఉదయం 9గంటల కల్లా హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

చాట్రాయి: ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ సూచించారు. మండలంలోని చనుబండ గ్రామంలో మంగళవారం నిర్వహిస్తున్న ఈకేవైసీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము సాగు చేస్తున్న పంటలను గ్రామంలోని రైతు భరోసా కేంద్ర వద్ద ఈనెల 5వ తేదీలోపు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు.

ఇంటింటికీ తాగునీటి కుళాయి

చాట్రాయి: జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చనుబండ, కృష్ణారావుపాలెం, బూరుగుగూడెం గ్రామ పంచాయతీల్లో మంగళవారం నిర్వహించిన పారిశుద్ధ్య కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిఒక్కరికీ తాగునీరు సరఫరా చేస్తామన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు హైమావతి, జ్యోతి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

గంపలగూడెం: తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణ నిధి బుధవారం సాయంత్రం మూడు గంటల నుంచి గంపలగూడెం మండలంలో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో గాదెవారిగూడెం, ఊటుకూరుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు, ఊటుకూరులో పైప్‌లైన్ విస్తరణ పనులు ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

తిరువూరు: కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక అమరావతీ ఆస్పత్రిలో మంగళవారం పాల ఉత్పత్తిదారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఈ శిబిరం ప్రారంభించారు. తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు మండలాల్లోని పాల ఉత్పత్తిదారులు, పాల శీతల కేంద్ర సిబ్బందికి ఉచిత వైద్యపరీక్షలు చేశారు. లక్ష్మీపురం పాల శీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి పర్యవేక్షించారు.

రెండు గ్రామాల్లో సభలు

తిరువూరురూరల్: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని పెద్దవరం, ఎర్రమాడు గ్రామపంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్‌లు గద్దె అప్పారావు, బొర్రా మాధవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానించారు. ఎంపీటీసీ సభ్యుడు గద్దె రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రంగారావు పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం

తిరువూరు: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని తిరువూరు నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. సీనియర్ సిటిజన్లు మిట్టపల్లి బుచ్చిరాజు, గద్దె రాఘవయ్య, రావిరాల వెంకటేశ్వరరావు, ఎదుళ్ల రాఘవులు, ఎక్కిరల రామారావు, దేవయాజనం సత్యనారాయణాచార్యులు, టీకే బాలకృష్ణ, కొమ్మినేని రామకృష్ణ, దంతాల వెంకట నరసయ్యను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ సుశీలరావు తెలిపారు. రాజనీతి శాస్త్రం, గణితశాస్త్రం సబ్జెక్టులను బోధించేందుకు సంబంధిత విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నెట్, ఏపీ సెట్ ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తులను తమ కళాశాలలో అందజేయాలని పేర్కొన్నారు. 9న అభ్యర్థులకు మౌఖిక పరీక్షజరుగుతుందని తెలిపారు.

కానిస్టేబుల్ నాగేంద్రకు నివాళులు

నూజివీడు(ఆగిరిపల్లి): యువకుడి దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నరేంద్రకు నివాళులర్పిస్తూ ఆగిరిపల్లిలో మంగళవారం రాత్రి పోలీసులు, రాజకీయ పార్టీల నాయకులు, స్థానికులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పోలీసుపై అనాగరిక సంఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. నూజివీడు రూరల్ సీఐ బాలసురేష్‌బాబు, ఎస్సై చంటిబాబు పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: కానిస్టేబుల్ నరేంద్ర మృతి చెందిన నేపథ్యంలో పట్టణంలోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో పోలీసులు, వ్యాపారులు, విలేకరులు కలిసి మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం


నూజివీడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు


విస్సన్నపేట మండలం చుండ్రుపట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి


చాట్రాయి మండలం చనుబండలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న దేశిరెడ్డి రాఘవరెడ్డి


తుమ్మలపాలెంలో మెడికల్ కిట్లు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి, ఎంపీపీ జోత్స్న


గంగినేని గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని, ప్రారంభిస్తున్న నాయకులు


గంపలగూడెం మండలం గోసవీడులో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శృతి


తిరువూరు 15వ వార్డులో ఆరోగ్య సురక్ష వైద్యసేవలు

ఎమ్మెల్యేలు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, రక్షణనిధి

నూజివీడు: రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని, దీనిలో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడులోని కోనేరు పేటలో ఉన్న వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మకమైన చర్యలను చేపట్టారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ముంగిట్లోకే వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ శిబిరాల్లో వైద్యులు పరీక్షించిన తర్వాత అవసరమైన వారికి విజయవాడ, హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం వైద్యం అందిస్తామన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత వరకు నిర్వహించలేదన్నారు. ఒకవైపు సంక్షేమం, అభివృద్ధితో పాటు మరోవైపు ప్రజల ఆరోగ్యానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ దయాల ఆశా, ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్వై నూరాణి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు తుమ్మూరి మౌనిక, దాసరి మారు అప్పాజీ, నవుడు నాగమల్లేశ్వరరావు, కొడవటి రాంబాబు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటగిరి పూర్ణిమ, నాయకుడు దామెర జోగారావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: ప్రజల ఆరోగ్య సంరక్షణే జగన్ ప్రభుత్వ ధ్యేయమని రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు


రెడ్డిగూడెం మండలం మద్దులపర్వలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాలతో మండలంలోని మద్దులపర్వలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్నీ ఆరోగ్యపరంగా ఉంచడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బలగానితిరుపతిరావు, పాలంకి రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ కృష్ణ, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, పంచాయతీ కార్యదర్శి షేక్ మీరా సాహెబ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సందేష్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

చండ్రుపట్ల (విస్సన్నపేట): ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని చండ్రుపట్ల ఎంపీయూపీ పాఠశాలవద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే అని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించి పౌష్టికాహారాన్ని రుచిచూశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివబాజీ, చండ్రుపట్ల, లంబాడీ తండా, విస్సన్నపేట, తాతకుంట్ల సర్పంచ్‌లు బాల కొండయ్య, దారావతు బోడి, ఎస్ నాగమల్లేశ్వరి, వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు పాల్గొన్నారు.

విశేష స్పందన

చాట్రాయి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని చనుబండ గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 265 మందికి వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేవారు. కార్యక్రమంలో సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు దార్ల సోనీ ఆనంద్, తహసీల్దార్ విశ్వనాథరావు, డాక్టర్లు వైష్ణవి(డెర్మటాలజిస్టు), కిరణ్మయ్ జీజీహెచ్ ఏలూరు, పీహెచ్‌సీ వైద్యులు విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్, జ్యోతి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తారని జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. మండలంలోని తుమ్మలపాలెం, ఈలప్రోలులో మంగళవారం రెండు విడతలుగా జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు సంయుక్తంగా పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాస్, మసూద్, తదితరుల ద్వారా వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మెడికల్ కిట్లు అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచులు బొమ్ము వెంకటరమణ, కరణం రంగారావు, ఈవోపీఆర్డీ మనోజ్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, మునేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

జి.కొండూరు: ప్రభుత్వ వైద్య సేవలను ప్రతి గడపకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న పథకాలకు శ్రీకారం చుడుతుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. మండల పరిధి గంగినేని గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధర రావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. పలువురు గ్రామస్తులకు వైద్య పరీక్షలు జరిపిన వైద్యాధికారులు, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంగినేని, తెల్లదేవరపాడు, దుగ్గిరాలపాడు గ్రామాల సర్పంచ్‌లు పిల్లి రామారావు, ఉమ్మడి ప్రసాద్, జడ రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రావు, డెప్యూటీ డీఎంహెచ్ఓ ఇందుమతి, వైద్యాధికారి డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

కనుమూరులో..

కనుమూరు(గంపలగూడెం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం గంపలగూడెం మండలం కనుమూరులో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామ సచివాలయ భవనంలో క్యాంప్ జరుగుతుందని పేర్కొన్నారు.

గోసవీడులో..

గోసవీడు(గంపలగూడెం): ప్రజారోగ్య పరిరక్షణకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను చేపట్టిందని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. గంపలగూడెం మండలం గోసవీడులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షకార్యక్రమంలో భాగంగా ప్రత్యే వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గంపలగూడెం, ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యాధికారులు శృతి, సురేష్, స్పెషలిస్టు డాక్టర్లు భాను తేజ, వాసవిలు 623 మంది రోగులను పరీక్షించారు. మందులను ఉచితంగా అందజేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు రోగులకు వివరించారు. సర్పంచ్ కె.పిచ్చియ్య, ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మీ, వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణారెడ్డి, సానికొమ్మురాజగోపాలరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

13 నుంచి ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

తిరువూరు: తిరువూరులో ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్యారోగ్య అధికారులు తెలిపారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసే ఈ శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యుల సేవలు ఉచితంగా అందుతాయని, రోగులు ఈ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

15వ వార్డులో వైద్యపరీక్షలు

తిరువూరు 15వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద సీజనల్ వ్యాధులు, ఇతర వ్యాధులకు గురైన వారి ఇళ్లకు ఆరోగ్య కార్యకర్తలు వెళ్లి వైద్యసేవలందించారు. గుండెజబ్బులు, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధుల బారిన పడిన వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్, ఆరోగ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పొందుగలలో..

పొందుగల(మైలవరం): ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం అని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి తెలిపారు. మైలవరం మండలం పొందుగల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి మంగళవారం ప్రారంభించారు. ఎంపీడీఓ లక్ష్మీకుమారి, సర్పంచ్ కోటమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఇస్లావత్ స్వామి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. నూజివీడు డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ దయాల ఆశా వైద్య శిబిరాన్ని పర్యవేక్షించి వైద్యులకు పలు సూచనలు చేశారు. వైద్య శిబిరంలో 354 మందికి పరీక్షలు చేశారు. నలుగురిని ఆరోగ్య శ్రీకి రిఫర్ చేశారు. మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు, ఎంపీడీఓ వీఏ విజయ్ కుమార్, సర్పంచ్ బొకినాల వెంకటేశ్వరమ్మ, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాస్, అనూష, సునంద కుమారి పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

నూజివీడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బోర్వంచ గ్రామ సచివాలయం పరిధిలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ వైద్యశిబిరం గ్రామంలోని ఆర్‌సీఎం స్కూల్ ఆవరణలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. స్పెషలిస్టు వైద్యులు ప్రజలను పరీక్షించి మందులు అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.


పొందుగల గ్రామంలో మందులు అందజేస్తున్న ఎంపీపీ ప్రసన్నరాణిస్వామి


నూజివీడు మండలం గొల్లపల్లిలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పేదలకు ఎంతో ఉపయోగకరం

ఏ.కొండూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని కోడూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ మండలంలో అన్ని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి అవసరమైన వారికి రక్తపరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తేళ్లూరి సురేష్, పీఏసీఎస్ చైర్మన్ అత్తునూరు వెంకటరెడ్డి, ఎంపీపీ నాగలక్ష్మీ, జెడ్పీటీసీ భూక్య గనియా, గ్రామ పార్టీ అధ్యక్షుడు శివ, మాజీ సర్పంచ్ సతీష్, వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు చెన్నారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు స్వాతి, సూపర్‌వైజర్ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు రవి, శ్రీను పాల్గొన్నారు.


కోడూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

పేదలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణ కలుగుతుందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజీంద్రన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన మంగళవారం అక్కిరెడ్డిగూడెం యూపీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు కరీముల్లా, ప్రతాప్, ఊపిరి తిత్తుల వైద్య నిపుణులు సురేష్ 347 మందికి పరీక్షలు చేసి, ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నూజివీడుకు రిఫర్ చేశారు. ప్రసూతి వైద్య నిపుణురాలు స్వప్న సింధు 12 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. అందరికీ మందులు అందజేసి, ఎమ్మెల్యే చేతుల మీదుగా 17 మందికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ రాజానాయన, ఎంపీటీసీ సభ్యులు పి.వెంకటేశ్వరరావు, దుర్గాభవానీ, గ్రామ సర్పంచ్ పి.లక్ష్మి, వైస్ సర్పంచ్ డి.వరహాలు, వైఎస్సార్ సీసీ మండలాధ్యక్షుడు నాగ వల్లేశ్వరరావు పాల్గొన్నారు.


అక్కిరెడ్డిగూడెంలో కళ్ల జోళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నారా లోకేష్‌ను అరెస్ట్ చేయాలి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు ఎలైన్‌మెంట్ మార్పులో భారీ అవినీతికి పాల్పడిన నారా లోకేష్, అందుకు సంబంధించిన వ్యక్తులను తక్షణం అరెస్ట్ చేయాలని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. గుంటుపల్లిలో మంగళవారం లోకేష్‌ను అరెస్ట్ చేయాలని ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే లోకేష్ తండ్రి చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతికి పాల్పడి జైల్లో ఉన్న విషయం తెలిసిందేనన్నారు. తండ్రి వారసత్వం పుణికిపుచ్చుకున్న కొడుకు కూడా అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాడన్నారు. ఓ పక్క అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నాయకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. వైస్ ఎంపీపీలు బండి నాగమణి, బాణావత్ నాగబాలమ్మ, నాయకులు పాలడుగు దుర్గాప్రసాద్, మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, లంకే అంకమోహనరావు, జానీ, గొర్రెని గాంధీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కన్వీనర్లు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.


నారా లోకేష్‌ను అరెస్ట్ చేయాలని ర్యాలీ నిర్వహించిన నాయకులు

సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్న యువత

మైలవరం: నేటి యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని ప్రజ్వల సంస్థ సీనియర్ కో–ఆర్డినేటర్ వై చంద్రయ్య తెలిపారు. మైలవరం డీఆర్‌డీఏ కార్యాలయం సమావేశ హాలులో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, ఎన్టీఆర్ జిల్లా మైలవరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపై మంగళవారం అవగాహనా సదస్సు జరిగింది. చంద్రయ్య మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ ఈ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా గత 26 సంవత్సరాలుగా పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత ఐసీడీఎస్, పోలీస్, జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఇప్పటి వరకు 27,000 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించినట్లు పేర్కొన్నారు. యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారన్నారు. వారిని గమనిస్తూ అప్రమత్తం చేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణా వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తూ సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. చట్టాలు శిక్షలు, ప్రభుత్వ పథకాలు గురించి మహిళా హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098(112), 100, 1930, సైబర్ ట్రాఫికింగ్ గురించి తెలియజేసినట్లు పేర్కొన్నారు కార్యక్రమంలో ప్రాజక్టు డైరెక్టర్ శ్రీనివాస్, మహిళలు, విద్యార్థులు, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ శ్రావ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటరత్నం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డెప్యుటేషన్‌ను పరిశీలించాలి

ఇబ్రహీంపట్నం: నందిగామ డివిజన్ పరిధిలో సర్దుబాటు పేరుతో దూర ప్రాంతాలకు వేసిన డెప్యుటేషన్‌ను పరిశీలించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్‌జానీ, సోలా రాఘవరాజు కోరారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో మంగళవారం డీవైఈఓ వెంకటప్పయ్యకు వినతిపత్రం అందజేశారు. ఫ్రీహైస్కూల్స్‌లో 98మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న పాఠశాల కంటే 98మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉన్న విషయం గుర్తించాలన్నారు.

ఆగ్రో ఫారెస్ట్రీతో బహుళ ప్రయోజనాలు

ఏకొండూరు: మండలంలోని గోపాలపురంలో మంగళవారం ఆగ్రో ఫారెస్ట్రీ ప్రాజెక్టుపై రైతులకు వరాహ క్లయిమేట్ అగ్రి సంస్థ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. మొక్కలు నాటడం వలన రైతులకు అదనపు ఆదాయంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని సౌత్ లీడ్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. టీమ్ లీడ్ కీర్తి పులి, మచిలీపట్నం కారుణ్య యూత్ రూరల్ డెవలప్‌మెంట్ ఎన్జీఓ ప్రెసిడెంట్ మధుసూదన్, గోపాలపురం సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి సోదరుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి అనారోగ్యంగా ఉండటంతో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పుట్రేల గ్రామపంచాయతీ 14వ వార్డు సభ్యుడు ధర్మరాజుల మాధవరావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి, నివాళులర్పించారు.

తలసేమియా బాధిత బాలికకు పింఛన్ మంజూరు

నూజివీడు(ఆగిరిపల్లి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలికకు మంజూరైన పింఛన్‌ను మంగళవారం అందజేశారు. ఆగిరిపల్లి మండలం ఈదులగూడేనికి చెందిన షేక్ లాల్‌బీ కుమార్తె రఫీబేగం తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఈలప్రోలు వెంకట సుబ్బయ్య తదితరులు నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన ఏలూరు డీఎంహెచ్ఓతో మాట్లాడి రఫీబేగంకు పింఛన్ మంజూరు చేయించారు. బాలికకు ప్రభుత్వం నెలకు రూ.10వేలు పింఛన్‌గా చెల్లించనుంది. బాలిక తల్లి లాల్‌బీ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రతాప్‌కు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉంటామని పేర్కొంది. ఇప్పటికే తనకు రూ.2,750 పింఛన్ వస్తోందని, ఇప్పుడు తన కుమార్తెకు కూడా రూ.10వేలు మంజూరైందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఆరేపల్లి రామకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు, వలంటీర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


బాలికకు పింఛన్‌ను అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య